క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన

రేణిగుంట: గాజులమండ్యంలోని కామాక్షి సమేత మూలస్థానేశ్వర ఆలయంలోని కల్యాణ మండపంలో సోమవారం విద్యార్థులకు ఇంటర్నేషనల్ ట్రైనర్ డాక్టర్ విష్ణువర్ధన్, శిష్యులు రూపేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యవసర ప్రాథమిక వైద్యచికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుండెపోటు, పాము కాటు, మూర్ఛ తదితర ప్రమాదకర పరిస్థితుల్లో అత్యవసర ప్రాథమిక చికిత్స ఎలా అందించాలన్న విషయాలపై డెమో ఇచ్చి, వివరించారు. అనంతరం సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయ రెడ్డి, శ్రీ సాయి గణేష్ విద్యాసంస్థ కరస్పాండెంట్ చెంచురెడ్డి కలసి డాక్టర్ దంపతులను సన్మానించారు.

వివక్ష.. చట్టరీత్యా నేరం

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు కుల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. సోమవారం నీర్పాకోట గ్రామంలోని ఎస్టీ కాలనీలోని ప్రైమరీ పాఠశాల్లో గిరిజనుల సమస్యలు, విద్యావ్యవస్థపై పంచాయతీ రాజ్ అధికారులు, ఎంఈఓల ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈఓ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

మాస్టర్ ధనుష్‌కు డాక్టరేట్

శ్రీకాళహస్తి: పట్టణంలో ముత్యాలమ్మ గుడివీధికి చెందిన కెన్ షేటో రియో కరాటే ఇన్‌స్టిట్యూట్ మాస్టర్ ధనుష్‌కు వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ సోమవారం డాక్టరేట్ సర్టిఫికెట్ ప్రదానం చేసింది. 21 ఏళ్లగా మార్షల్ ఆర్ట్సలో అయన చేసిన సాధనకుగాను ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా వారి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రేణిగుంట: మండలంలోని పిల్లపాళెం సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలపై సోమవారం సాయంత్రం రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ జయకృష్ణ దాడులు చేశారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని తహసీల్దార్ హెచ్చరించారు.

వెబ్ ఆప్షన్ నమోదు

సత్యవేడు: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సుల అడ్మిషన్లు సంబంధించి పాలీసెట్‌లో ర్యాంకులు పొందిన విద్యార్థులు వెబ్ ఆప్షన్ నమోదు చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం వెబ్ ఆప్షన్లు నమోదు ప్రక్రియ నిర్వహించారు.

తొట్టంబేడు తహసీల్దార్‌గా భారతి బాధ్యతల స్వీకరణ

తొట్టంబేడు: మండల తహసీల్దార్‌గా పి.భారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న యు.మధుసూదన్ రావు సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో తిరుపతి కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న పి. భారతి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

శివయ్య సేవలో సిప్లిగంజ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం తెలుగు సినిమా, జానపద పాటల గాయకుడు, రచయిత రాహుల్ సిప్లిగంజ్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. వారికి అలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం మృత్యుంజయలింగం వద్ద శేషవస్త్రంతో సన్మానించి, స్వామి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కేవీబీపురం: మండలంలోని సూరమాలలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. సూరమాలలో పేకాట నిర్వహిస్తున్నారని పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన ఎస్‌ఐ నరేష్ తన సిబ్బందితోపాటు, పిచ్చాటూరు స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బందితో కలసి సోమవారం దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.21950 నగదుతో పాటు, తొమ్మిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా ఆషాఢ నవరాత్రులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలోని పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వారాహి ఆషాఢ నవరాత్రులు ఐదో రోజైన సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు వారాహి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమాలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీ శ్రీనివాస మిల్క్ డెయిరీ యాజమాని ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈఓ లత ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గజవాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామివారు గజవాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం నిత్యపూజలు, పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామి వారికి స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి గజవాహనంపై ఊరేగించారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ పాల్గొన్నారు.

సమాధానం చెప్పలేకున్నాం

- కేవీబీపురంలో మండలమీట్



అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

కేవీబీపురం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు రాజీ పడొద్దని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అందులో భాగంగా ఆయన ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు సర్పంచ్‌లు హౌసింగ్, ఉపాధి, రెవెన్యూ శాఖల అధికారులపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. అధికారులు చేస్తున్న తప్పిదాలతో గ్రామాల్లో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని కోటమంగాపురం సర్పంచ్ తిరుపాల్‌యాదవ్ ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. తమ పంచాయతీలో ఇళ్లు మంజూరైన వారికి ఇంత వరకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. కర్లపూడి సర్పంచ్ చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ నేతలు దళితుడినైన తనను వేధించి తమ భూముల్లో వ్యవసాయం చేయనీయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే ముందరే నేలపై కూర్చుని ఆందోళనకు దిగారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అధికారులకు సూచనలు..

ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ వర్షాలకు ముందే వ్యవసాయానికి అనుగుణంగా చెరువులు, పంట కాలువలను తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఆరోగ్యశాఖ మండల అధికారులు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, సీజనల్ వ్యాధులు ముదరక ముందే తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా మండల వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సకాలంలో యూరియా, ఎరువులను అందించాలని సూచించారు. జెడ్పీటీసీ మూర్తి మునెమ్మ, ఎంపీపీ మునిలక్ష్మి, ఎంపీడీఓ మాలతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

కేవీబీపురం తహసీల్దార్‌గా రోశయ్య

కేవీబీపురం: చాలా రోజులుగా తహసీల్దార్ లేక పాలన కుంటు పడడంతో పాటు ప్రజలు, విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల కోసం పడుతున్న ఇబ్బందులపై సాక్షి పత్రిక జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఇందుకు సంబంధించి సాక్షి పత్రికలో ఆదివారం 'తహసీల్దార్ కుర్చీ ఖాళీ..విద్యార్థుల ఇక్కట్లు' అని కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా అధికారులు స్పందించి కేవీబీపురం తహసీల్దార్‌గా ఎం.రోశయ్యను ఆగమేఘాల మీద నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవా రం ఆయన తన కార్యాలయంలో బాధ్యత లు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన కు కార్యాలయ అధికారులు, సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ రోశయ్య మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

విజిలెన్స్, మైన్స్ అధికారుల దాడులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ రవాణాపై విజిలెన్స్, మైన్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. గ్రావెల్ అక్రమ రవాణాపై జూన్ 27వ తేదీన పచ్చనేతల మట్టి మాఫియా అన్న శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తిరుపతికి చెందిన విజిలెన్స్, మైన్స్ అధికారులు సోమవారం వరదయ్యపాళెం మండలంలోగ్రావెల్ అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. శ్రీసిటీ పరిసరాల్లో ఎలాంటి బిల్లులు, అనుమతులు లేకుండా గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లారీలను శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

భూ వివాదంలో మహిళపై దాడి

తొట్టంబేడు: మండలంలోని గురుకుల పాలెంలో రెండు కుటుంబాల మధ్య గొడవ సోమవారం దాడికి దారితీసింది. రెండు కుటుంబాల మధ్య భూ వివాదం కోర్టులో నడుస్తోంది. స్థానికుల కథనం మేరకు సోమవారం సురేష్, వెంకటయ్య, భాను ప్రకాష్, భాను ప్రకాష్ నాయుడు, రాంప్రకాష్ నాయుడు వివాదాస్పద భూమిలోకి ప్రవేశించాలని ప్రయత్నించారు. చాముండేశ్వరి ముత్యాలమ్మ రేవతి గిరిబాబు, రామకృష్ణ వారిని అడ్డుకున్నారు. దీంతో వారు రేవతిపై దాడి చేశారు. ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే దీనిపై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

ఘనంగా గంగమ్మ కొలుపు

వరదయ్యపాళెం: మండలంలోని సిద్ధమ్మఅగ్రహారంలో గంగమ్మ కొలుపు వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రిపైగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించగా స్థానికులు పూజలు చేశారు.

అమ్మవారి సేవలో నూకతోటి రాజేష్

గంగమ్మ కొలుపులో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్ ఆయనకు స్వాగతం పలికారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, నాయకులు దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దేవేళ్ల మహేంద్ర, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్ యాదవ్, స్థానిక సర్పంచ్ కవిత తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సేవలో నూకతోటి రాజేష్

మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గాజులపెళ్లూరు, పుత్తేరి గ్రామాల్లో ఉచితంగా పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోందన్నారు. క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు హరిత, చైతన్యభాను, సీహెచ్‌ఓ వెంకటేశులు, సర్పంచులు రామ్మూర్తి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగ్నేయ గణపతికి పంచనామా

శ్రీకాళహస్తి : పట్టణంలోని మాడవీధిలో ఉన్న ఆగ్నేయ గణపతి స్వామి విగ్రహానికి సోమవారం పంచనామా నిర్వహించారు. ఆలయాధికారులు ఆగ్నేయ గణపతి స్వామి కుంభాభిషేకం నిమిత్తం ఆలయ మరమ్మతుల్లో భాగంగా ఆగ్నేయ గణపతి స్వామి విగ్రహానికి పంచనామా చేసి, తొలగిరచారు. మరమ్మతుల అనంతరం శాస్త్రోక్తంగా ప్రతిష్టిస్తామన్నారు.

వాహనాలపై నకిలీ స్టిక్కర్లు ఉంటే చర్యలు

సత్యవేడు: వాహనాలపై నకిలీ స్టిక్కర్లు ఉంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామస్వామి హెచ్చరించారు. సీఐ మురళీనాయుడు సూచనల మేరకు సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రెస్, రెవెన్యూ, అటవీ, హెల్త్, ఇతర శాఖలకు సంబంధించిన వారు కాకుండా ఇతరులు తమ వాహనాలపై స్టిక్కర్లు వేసుకుని, తనిఖీల్లో చిక్కితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నడిరోడ్డుపై క్షుద్రపూజల కలకలం

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ–విడోస్ కాలనీకి వెళ్లే మార్గంలో ఒకరి ఇంటికి ఎదురుగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నడిరోడ్డుపై చేసి ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం స్థానికులు రోడ్డుపై వెళ్లగా క్షుద్రపూజలు చేసేందుకు వేసిన ముగ్గు అందులో ఉంచిన జంతువు పుర్రె, నిమ్మకాయలు, బొమ్మను చూసి ఆందోళనకు గురయ్యారు. అదే ఇంటి ముందు గత ఆరు మాసాల్లో ఇప్పటికి ఐదు పర్యాయాలు ఇలా చేశారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు రాత్రివేళల్లో బీసీ కాలనీ, విడోస్ కాలనీల్లో గస్తీ నిర్వహించాలని వారు కోరుతున్నారు.

వైభవంగా గ్రామోత్సవం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ద్రౌపదీసమేత స్వామి ఆలయంలో జరుగుతున్న తిరుణాళలో భాగంగా సోమవారం అర్జున, ద్రౌపది, శ్రీకష్ణ స్వాము గ్రామోత్సవం వైభవంగా సాగింది. ధర్మరాజుల గుడి వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవంలో పోతురాజు కత్తి పట్టుకుని ముందు వెళుతుండగా అర్జున, ద్రౌపదీ, శ్రీకష్ణ ఉత్సవమూర్తులు అనుసరించారు.



పురవీధుల్లో విహరిస్తున్న ఉత్సవమూర్తులు

అర్జున మత్స్యయంత్ర ఛేదనం

ద్రౌపదీ సమేత ధర్మరాజు స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అర్జునుడు మత్స్యయంత్ర ఛేదనం ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విల్లంబులు ధరించిన అర్జునుడి ఉత్సవమూర్తికి సర్వంగ సుందరంగా అలంకరించి, వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

వైద్యులకు సన్మానం



సన్మానం అందుకున్న వైద్యులు

శ్రీకాళహస్తి: డాక్టర్ బీసీరాయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ వైద్యుల దినోత్సవాన్ని యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యాధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మృదుల వాణి, శ్రీకాళహస్తి డీఎస్పీ కే నరసింహామూర్తి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ ఆదేశించారు. సోమవారం ఆమె కొత్తగా వచ్చిన గ్రామ కార్యదర్శులకు సూచనలు చేశారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచే పింఛన్ పంపిణీ ప్రారంభించి, మధ్యాహ్నానికి పూర్తి చేయాలని తెలిపారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలవ్యాప్తంగా పింఛన్ లబ్ధిదారులకు జూలై 1వ తేదీన పింఛను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బాలాజి నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 12 సచివాలయాల పరిధిలో మొత్తం 5,291 మంది లబ్ధిదారులకు రూ.2,23,23,500 పంపిణీ చేస్తామన్నారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచే పింఛను అందజేస్తారన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక అభిషేకాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ మృత్యుంజయ స్వామివారికి పంచ హారతులు సమర్పించి, భక్తులపై స్వామివారి అభిషేక జలాలను చల్లి దీవించారు. మృత్యుంజయ లింగానికి పుష్పాలతో అలంకరించారు. నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

నాగలాపురం: మండలంలోని బీరకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రేవతి ఉద్యోగ విరమణ చెందారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ బాబయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల మేధో శక్తిని పెంచే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలన్నారు. అనంతరం ఉపాధ్యాయులంతా కలిసి ఆమెను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నిర్మల, హెచ్‌ఎం హేమకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన రేవతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు